క్లుప్తంగా

మహాశివుడికి విశేష అభిషేకాలు



నాగాయలంక: కార్తిక అరుద్ర నక్షత్ర విశిష్టత, సంకట హర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం పలు ఆలయాల్లో మహాశివుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. నాగాయలంకలోని శ్రీపార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు. భస్మం(విభూధి) మారేడు దళాల అలంకారంలో శివయ్యను భక్తులు దర్శించుకున్నారు. మండలంలోని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, వట్టివేళ్లతో సుందరంగా అలంకరించారు. అలాగే విఘ్నేశ్వరునికి అభిషేకాలు చేసి గరికగడ్డితో అలంకరించారు. నాగాయలంక కృష్ణానది తీరంలోని పుష్కరఘాట్‌లో శ్రీరామలింగేశ్వరునికి భక్తులు నదీజలంతో స్వీయ అభిషేకాలు చేశారు.

ఉప్పెన మృతులకు నివాళులు



పులిగడ్డ(అవనిగడ్డ): దివిసీమ ఉప్పెన మృతులకు పలు పార్టీల నాయకులు మంగళవారం నివాళులర్పించారు. మండల పరిధిలోని పులిగడ్డ ఉప్పెన మృతుల స్థూపం వద్ద ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 1977 నవంబర్ 19వ తేదీన సంభవించిన ఉప్పెన ఎంతో విషాదకరమని పేర్కొన్నారు. అలాగే జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్‌తో పాటు పలువురు జనసేన, టీడీపీ నాయకులు ఉప్పెన మృతుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

కల్తీ ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు



చిలకలపూడి(మచిలీపట్నం): రెస్టారెంట్లు, మెస్‌ల్లో కల్తీ ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ కంట్రోలర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని పలు రెస్టారెంట్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చల్లరాస్తా సెంటరులోని రాజుగారి బిర్యానీ సెంటర్, ప్రధాన రహదారిలోని వాణి హాట్ అండ్ స్పైసీ రెస్టారెంట్లను తనిఖీ చేశారు. వంటకాలను శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపారు. రెస్టారెంట్లలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని శ్రీనివాసరావు తెలిపారు. రెస్టారెంట్లపై తమకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనిఖీలు నిర్వహించామన్నారు. ల్యాబ్ నుంచి రిపోర్టులు వచ్చిన అనంతరం వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీలో బల్లిపర్రు విద్యార్థినుల ప్రతిభ



పెడన: మండలంలోని బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థినులు జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పాలసానపల్లి గురుకుల పాఠశాలలో ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన జోనల్ స్థాయి జూనియర్ విభాగం కబడ్డీ పోటీల్లో బల్లిపర్రు గురుకుల పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కె.అరుణ, ఎం. కావ్య శ్రీ, కె. సునీత, ఎం. సిరివల్లి, బి. ప్రణతీలక్ష్మి, జి. అనుష్క, ఎ. పూజితలతోపాటు వ్యాయామ ఉపాధ్యాయిని పి. మాధవిని అభినందించారు.

కిడ్నీ బాధితునికి సీఎం సహాయనిధి మంజూరు

బంటుమిల్లి: మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన గొల్ల నాగరాజు కుమారుడు దినేష్(11)కు కిడ్నీ వ్యాధి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి రూ. 1,89,264లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది కాలంగా దినేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో దినేష్‌కు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రి నివేదిక మేరకు సీఎం సహాయనిధి నుంచి నిధులను లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ) మంజూరు చేశారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆదాయానికి గండి

- చెరువులను పట్టించుకోకపోవడంతో ఆదాయం కోల్పోతున్న పురపాలిక
- 15 నెలలు గడిచినా చేపలు పెరుగుదల లేదని వాపోతున్న పాటదారుడు
- చెరువులో కలంకారి వస్త్రాల నీళ్ల తీత పనులతో రసాయనాలు, గెంజి



పైడమ్మ చెరువు వద్ద ఆరబెట్టిన కలంకారి వస్త్రాలు..కోరా క్లాత్

పెడన: పురపాలిక అధికారుల వ్యవహార శైలితో పురపాలక సంఘం ఆదాయాన్ని కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదాయం వచ్చే విధంగా నడుచుకోవాల్సిన పురపాలక సంఘ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. మరింత నష్టం చేకూర్చేలా.. భవిష్యత్తులో ఎవరూ కూడా ముందుకు రాని విధంగా నడుచుకుంటున్నారు. లీజు ఇవ్వడం వరకే తమ బాధ్యత అని, సంరక్షణ చర్యలు మీరే చూసుకోవాలని పేర్కొనడం విడ్డూరంగా ఉంది. వివరాల్లోకి వెళ్లితే.. పెడన పురపాలక సంఘ పరిధిలో పైడమ్మ చెరువు ప్రతి మూడేళ్లకు చేపలు పెంపకానికి లీజుకు ఇస్తారు. గత ఏడాది ఆగస్టులో రూ. 6.50లక్షలకు మొవ్వ మండలం పెదపూడికి చెందిన కట్టా శ్రీనివాసరావు పాడుకున్నాడు. రూ. లక్ష డిపాజిట్ చేసి ఇప్పటి వరకు రెండు దఫాలుగా రూ. 4,50,666లు పురపాలక సంఘానికి చెల్లించాడు. అయితే 15 నెలలు గడిచినా ఒక్క పంట కూడా తీయలేదు. వాస్తవంగా చెపల చెరువు వేసిన వారు ప్రతి ఆరు, ఏడు నెలలకు చేపల పట్టుబడి చేసి విక్రయించుకుంటారు. అయితే చెరువులో కలంకారి వస్త్రాలను గుంజడం, నానబెట్టడం, నీళ్లతీత పనులు చేస్తున్నారు. దీనిపై శ్రీనివాసరావు కలంకారి వస్త్రాలను తీసుకువచ్చిన వారికి చెప్పినా పరిస్థితిలో మార్పు రాలేదు. పురపాలక అధికారులకు తెలియజేసినా వారు స్పందించలేదు. చేపల చెరువులో విషప్రయోగం చేస్తామంటూ బెదిరిస్తున్నారని పాటదారుడు మున్సిపల్ అధికారుల వద్ద వాపోయాడు. జిల్లా కలెక్టర్‌కు మీ కోసంలో ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయిందని పాటదారుడు వాపోతున్నాడు. ఇలా అయితే భవిష్యత్తులో ఎవరూ కూడా చేరువును లీజుకు తీసుకోవడానికి ముందుకు రాని పరిస్థితి ఏర్పడి పురపాలక ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

నాపై చేయి చేసుకున్నారు



కుటుంబంతో చెరువు వద్ద కాపలా ఉంటున్నా. వస్త్రాలను చెరువు వద్దకు తీసుకువచ్చి చెరువులో గుంజుతున్న వారికి నచ్చజెప్పా. వినిపించుకోకుండా నాతో గొడవపడి చేయి చేసుకున్నారు. చేపలు ఎలా పడతారో చూస్తామంటూ బెదిరించారు. పారుగూరు నుంచి వచ్చి ఇక్కడ నీ పెత్తనం ఏమిటంటూ చెరువులోకి తోసేశారు. భయంగా ఉంది. ఏం చేస్తారోనని ఓనరుకు తెలియజేశా.

–కామిశెట్టి శ్రీనివాసరావు, కాపాలాదారుడు, పైడమ్మ చెరువు

అధికారులు పట్టించుకోవడం లేదు



పురపాలక సంఘానికి ఇప్పటి వరకు రూ. 5.50లక్షలు వరకు చెల్లించా. ఇందులో రూ. లక్ష డిపాజిట్ కూడా ఉంది. 15 నెలలు అయినా ఒక్క పంట కూడా తీయలేదు. ఇప్పటి వరకు రూ. 20లక్షలకుపైగా వెచ్చించా. చేప పిల్ల ఎదుగుదల లేదు. కలంకారి వస్త్రాల నీళతీత పనులు నిలుపుదల చేయడం లేదు. ఆపాలని కోరితే బెదిరిస్తున్నారు. ఇదే విషయాన్ని పురపాలక అధికారులకు చెప్తే వారు పట్టించుకోవడం లేదు.

–కట్టా శ్రీనివాసరావు, పాటదారుడు, పైడమ్మ చెరువు, పెదపాడు

చెరువులోకి దిగకూడదని చెప్పా



పైడమ్మ చెరువులో కలంకారి వస్త్రాల నీళ్లతీత పనులను నిలుపుదల చేయాలని స్పష్టం చేయడం జరిగింది. కాపలాగా మున్సిపల్ సిబ్బందిని కూడా పెట్టడం జరిగింది. కలంకారి వస్త్రాలను నీళ్లతీత పనులు చేసేవారు వచ్చి కలిశారు. పైడమ్మ చెరువులోకి దిగకూడదని స్పష్టం చేశా. పక్కనే ఉన్న రజకుల చెరువులో నీళ్లతీత పనులు చేసుకోవాలని సూచించాం.

–ఎం. గోపాలరావు, మున్సిపల్ కమిషనర్, పెడన

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలకు హాజరుకండి

ఎన్‌సీఈఆర్టీ సీఈవో డాక్టర్ తాడేపల్లి శర్మ



కలెక్టర్ బాలాజీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఎన్‌సీఈఆర్టీ ప్రతినిధులు

చిలకలపూడి(మచిలీపట్నం): కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబరు నెలలో జరగబోయే కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలకు హాజరు కావాలని జాతీయ సాంస్కృతిక పరిశోధన, శిక్షణా కేంద్రం (ఎన్‌సీఈఆర్టీ) సీఈవో డాక్టర్ తాడేపల్లి శర్మ, డాక్టర్ వేదాంతం వెంకట నాగచలపతిరావు కలెక్టర్ డీకే బాలాజీకి మంగళవారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ మేరకు ఆయన చాంబర్‌లో కలిసిన వారు మాట్లాడుతూ డిసెంబరు 27, 28, 29 తేదీల్లో కూచిపూడి నాట్య కళాక్షేత్రంలో పతాక స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరుపున వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందిన కళాకారులకు పింఛను మంజూరు చేసే పథకం గురించి ఎన్‌సీఈఆర్టీ సీఈవో జిల్లా కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ ఆ పథకం సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని పూర్తి వివరాలు అందజేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో కే చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

నేడు ఆక్వా చెరువులకు విద్యుత్ కోత

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆక్వా రొయ్యల చెరువులకు బుధవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు ఆ శాఖ ఈఈ డి. కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ ఎక్స్‌ప్రెస్ లైన్ మరమ్మతుల్లో భాగంగా పిట్టల్లంక, సాలెంపాలెం పంచాయతీల పరిధిలోని చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని 104 సిబ్బంది వినతి

అవనిగడ్డ: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ 104 సిబ్బంది ఎంపీటీసీ సభ్యుడు కటికల వసంత్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు ఇప్పించడంతో పాటు ప్రతి నెలా జీవో నెంబర్–7 ప్రకారం వేతనాలు అందించాలని, పనికి సమాన వేతనం ఇవ్వాలని, వాహనాలకు ఫిట్‌నెస్ సమకూర్చాలని కోరుతూ గత కొద్ది రోజులుగా సిబ్బంది పలు విధాలుగా ఆందోళనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎంపీటీసీ సభ్యుడికి వినతి పత్రం సమర్పించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి పీఏసీఎస్ ప్రాంగణంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని యువనేత మండలి వెంకట్రామ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీ కృష్ణ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విధివిధానాలు తెలియజేశారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, సర్పంచ్ చలపాటి రాణి, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యుడు వేమూరి సాయి, సచివాలయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్రాలు, పంచారామాలకు ప్రత్యేక బస్సులు

చిలకలపూడి(మచిలీపట్నం): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మచిలీపట్నం నుంచి ప్రముఖ శైవ క్షేత్రాలు, పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి. పెద్దిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలను ఒకే రోజు దర్శించుకునేలా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో రాత్రి 12.30 గంటలకు మచిలీపట్నం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. అలాగే 23వ తేదీ శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి వాడపల్లికి మూడు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటల నుంచి శ్రీశైలం వరకు అల్ట్రా డీలక్స్ స్పెషల్ బస్సులను నడుపుతున్నామని చెప్పారు. వీటితో పాటు శబరిమల వెళ్లే అయ్యప్ప మాలదారుల కోసం కొత్త బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959235462, 9618480995 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అన్నం పరబ్రహ్మ శివ స్వరూపం



శివయ్యకు అన్నాభిషేకం చేస్తున్న బ్రహ్మశ్రీ సాయికిరణ్ శర్మ

నాగాయలంక: నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం మండపంలో మంగళవారం శ్రీరామలింగేశ్వరస్వామికి అయ్యప్పస్వాములు, ఇతర దాతల ఆర్థిక సాయంతో 100కిలోల బియ్యంతో అన్నం వండి అభిషేకం చేశారు. ఆరుద్ర నక్షత్రం, సంకటహర చతుర్థశి విశిష్టత పురస్కరించుకుని అన్నం పరబ్రహ్మ శివ స్వరూపం అన్నచందాన ఈ మహోన్నతమైన అభిషేకంతో శివయ్యను ముంచెత్తారు. ఉభయ దాతలు సబ్బినేని రమేష్–శ్రావణి మండపం ఎదుట ఉంచిన కోటి వత్తుల దీప స్తంభానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత అన్నాభిషేకాన్ని బ్రహ్మశ్రీ అంబా సాయి కిరణ్ శర్మ ప్రారంభించారు. అనంతరం నవ హారతులు, వీటికి అభిముఖంగా మహిళలు కార్తిక దీప ప్రమిదలతో సామూహిక నీరాజనం సమర్పించారు. కార్యక్రమాన్ని క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, కార్యనిర్వాహకుడు తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న జట్లు



షాట్‌పుట్ విసురుతున్న మహిళా కానిస్టేబుల్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కృష్ణాజిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో మంగళవారం ప్రారంభమైన కృష్ణాజిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024లో జిల్లాలోని సిబ్బందితో పాటు ఆయా సబ్‌డివిజన్‌ల అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అవనిగడ్డ, బందరు, గుడివాడ, గన్నవరం సబ్‌డివిజన్‌లకు చెందిన పలువురు పోలీసు క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని సత్తాచాటారు. పోటీల్లో పురుషులతో పాటు మహిళలు కూడా వారి వారి విభాగాల్లో గెలుపొందేందుకు హోరాహోరీగా తలపడ్డారు. – కోనేరుసెంటర్



100 మీటర్ల పరుగుపందెంలో మహిళలు



లాంగ్‌జంప్ చేస్తున్న కానిస్టేబుల్

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ తదితర శాఖల అధికారులతో మంగళవారం ఆయన చాంబర్‌లో పథకం అమలు తీరుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం వినియోగించుకుంటే కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందన్నారు. బ్యాంకు రుణాలు, రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నూరుశాతం ఈ పథకాన్ని అమలు చేసి జిల్లాలో ఆదర్శ గ్రామాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానందం, నోడల్ అధికారి ఎం. భాస్కరరావు, జెడ్పీ సీఈవో కె. కన్నమనాయుడు, డీపీవో జె. అరుణ, ఎల్‌డీఎం జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీవో నాయకులు

చల్లపల్లి(అవనిగడ్డ): ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్న ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో కిరణ్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు డెప్యూటీ తహశీల్దార్ శ్రీలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ అధ్యక్షుడు తోట సుధాకరరావు మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడటం దారుణమన్నారు. ఇందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీటీకి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మాధవేంద్రరావు, పి. బ్రహ్మానందరావు, షేక్ అతావుల్లా, శ్యాంసన్‌బాబు, నందం బాబూరావు, రామకోటేశ్వరరావు, వెటర్నరీ సర్జికల్ అసిస్టెంట్ డాక్టర్ మనోజ్, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



కోడూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



గూడూరులో విద్యార్థులు వేసిన ముగ్గును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరి

కోడూరు: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పుష్పలత పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో కోడూరు జెడ్పీ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. విద్యార్థులు పలు సందేశాత్మక ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవనిగడ్డ: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో మంగళవారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మరియాదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. ఉమారాణి మహిళా సాధికారత గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులకు మ్యూజిక్ చైర్ పోటీలు నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాస్, అధ్యాపకురాలు ఎం. రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయురాలు మాధవి, వెంకట నిర్మలాదేవి, జయలక్ష్మి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ వి. విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పెడన: పెడన శాఖా గ్రంథాలయంలో మంగళవారం పాఠశాలల విద్యార్థులకు జీకే పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి బసవేశ్వరరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గూడూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఎంపీడీఓ పి. రాజేశ్వరి విద్యార్థులు వేసిన ముగ్గులు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి వై. శ్రీనివాసరావు, బీడీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి, ఘంటసాల గ్రామాల్లోని గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రంథాలయాల లైబ్రేరియన్లు శరత్‌కుమార్, ఎం.సుబ్బారావు, టి.రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు బంగారు మంగళసూత్రాలు బహూకరణ



అమ్మవారికి అలంకరించిన బంగారు మంగళసూత్రాలు

కోడూరు: భక్తుల ఇలవేల్పు కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారికి దాతలు రూ.లక్షలు విలువ చేసే బంగారు మంగళసూత్రాలను బహూకరించారు. కోడూరుకు చెందిన దివంగత బత్తెన సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమార్తెలు, అల్లుళ్లు కోసూరు సత్యవాణి–వెంకటకృష్ణ, వర్రే ఇంద్రాణి–వెంకట విజయ్‌కుమార్‌లు రెండు బంగారు మంగళసూత్రాలు, నానుకోడును మంగళవారం అమ్మవారికి సమర్పించారు. మంగళసూత్రాలను అర్చకులు అమ్మవారికి అలంకరించారు. దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

మండలి విగ్రహావిష్కరణ



నంగేగడ్డ(నాగాయలంక): దివిసీమ ఉప్పెనతో మనోధైర్యం కోల్పోయిన వేలాది మంది బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. దివిసీమ గాంధీగా ప్రాచుర్యం కలిగిన నాటి కాంగ్రెస్ యోధుడు దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు విగ్రహాన్ని గ్రామంలోని రింగ్ రోడ్ ఆర్చ్ వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏపీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొణతాలలు మండలి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్(రాజా)తలశిల స్వర్ణలత, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మాజీ సర్పంచ్, ఆహ్వానసంఘం అధ్యక్షుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్చరీ జాతీయ స్కూల్ గేమ్స్‌లో రజితం



విజయవాడస్పోర్ట్స్: గుజరాత్‌లోని నాడియడ్‌లో జరిగిన 68వ ఆర్చరీ స్కూల్ గేమ్స్‌లో విజయవాడ క్రీడాకారులు చెరుకూరి డాలిశివానీ, ఆర్నవి, వైదేహి, నవ్య బృందం రజిత పతకాన్ని కైవసం చేసుకుంది. విజయవాడలోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ఈ బృందం పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. రజితం సాధించిన బృందాన్ని మంగళవారం ఏపీ ఆర్చరీ సంఘం కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ అభినందించారు.

గోకర్ణేశ్వరుడికి లక్ష బిల్వార్చన

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారికి మంగళవారం లక్ష బిల్వార్చనను నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని లింగాకారుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ బిల్వార్చన జరిగింది.